రంగపూర్ అంట్లు.. లాభాల చెట్లు

- కోడూరు ప్రభుత్వ నర్సరీకి ప్రత్యేక గుర్తింపు
- కొనుగోలు చేస్తే రైతులకు మేలు
- అందుబాటులో 50 వేల మొక్కలు



ఎగుమతులకు సిద్ధంగా ఉన్న చీనీ అంట్లు



ఉద్యానశాఖ అధికారి పర్యవేక్షణలో అంట్లు కడుతున్న కూలీలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యాన మాడ్రన్ నర్సరీలో రంగపూర్ మొలకలపై అంట్లు కట్టే చీనీ, బత్తాయి అంట్లు సుమారు 50 వేలకు పైగా అందుబాటులో ఉన్నాయి. రైతులు చీనీ, నిమ్మ రైతులు చెట్లను నాటే సమయంలో రంగపూర్ మొలకలపై కట్టిన చీనీ అంట్లను నాటుకోవడం రైతులకు ఎంతో మేలుచేస్తుంది. రైల్వేకోడూరు మండలంలోపలు నర్సరీల నుండి ప్రతి ఏడాది కోట్లలో వ్యాపారం నిర్వహిస్తుంటారు. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి రైతులు, వ్యాపారులు ఇక్కడ మకాం వేసి నర్సరీలన్నీ తిరిగి నాణ్యమైన మొక్కలు తీసుకెళ్తుంటారు. ఈ మొక్కలు ప్రైవేటు నర్సరీలలో ఒకటి 70 రూపాయల నుంచి 100 రూపాయల వరకు అమ్ముతుంటారు. ప్రభుత్వ నర్సరీలో బత్తాయి రూ.55కు రైతులకు ఇస్తారు. ఈ మొక్కలు అధికారుల పర్యవేక్షణలో పాలీ హౌస్‌లలో సంరక్షిస్తుంటారు. అదేకాక రంగపూర్ నారు స్వయంగా పెంచి నైపుణ్యవారి చేత అంట్లు కట్టిస్తారు. నిత్య ఉద్యానశాఖ అధికారి పర్యవేక్షణలో చీడపీడలను తట్టుకొనేలా సిద్ధం చేస్తారు. ప్రైవేటు నర్సరీలలో అలా ఉండదు. ఈ రంగపూర్ అంట్లు నాటినప్పటి నుంచి తెగుళ్లను తట్టుకుని ఎక్కువకాలం పంటను ఇవ్వడానికి వీలుంటుంది. అలాగే రైతులు రంగపూర్ అంట్లను నాటే ముందు రైతులు ఉద్యానశాఖ అధికారులు సలహాలు తీసుకుని పాటిస్తే సుమారు 30 సంవత్సరాలకు చెట్లు మన్నిక సాధిస్తాయని అధికారులు అంటున్నారు. తక్కువ నీటితో తెగుళ్ల లేకుండా రైతులకు ఫలితాన్ని ఇస్తాయి. ఇక్కడ ప్రతి యేటా లక్షల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఉపాధి హామీ రైతులకు అంట్లు ఉచితంగా ఇస్తారు.

మంచి ఫలితాలిస్తున్నాయి



రైల్వేకోడూరు ప్రభుత్వ నర్సరీలో చీనీ మొక్కలు ప్రతి ఏటా కొనుగోలు చేస్తుంటాను. 15 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన మొక్కలతో 5 ఎకరాలలో చీనీ తోట సాగు చేస్తున్నాను. ఇప్పటికీ చెట్లు మంచి దిగుబడిని ఇస్తున్నాయి. రంగపూర్ అంట్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. తక్కువ నీటిలోనూ మంచి దిగుబడి అందించేందుకు ఈ అంట్ల మొక్కలు దోహదం చేస్తాయి.

– సైదారెడ్డి, రైతు, మిర్యాలగూడ, తెలంగాణ

రైతులకు మేలు చేస్తాయి



రంగపూర్ అంట్లు తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం. రైతులు ఇతర అంట్లను నాటుకుండా కేవలం రంగపూర్ మొలకల మీద కట్టిన అంట్లను వాడుకోవడం ఎంతో శ్రేయష్కరం. చీడపీడల నియంత్రణను తట్టుకుంటాయన్నారు. ప్రభుత్వ నర్సరీలో రైతుల కోసం ప్రత్యేకంగా అన్ని జాగ్రత్తలతో ఈ మొక్కలను సంరక్షించాం. ఇతర రాష్ట్రాల రైతులు కోడూరు ప్రభుత్వ నర్సరీకి వచ్చి మొక్కలను తీసుకువెళ్తుంటారు.

– ఎస్.ఆషియా, నర్సరీ అధికారి, కోడూరు

క్లుప్తంగా

రేపు మండల సమావేశం

గాలివీడు : ఆదివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.డి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరుకావాలని తెలియజేశారు.

కోడూరులో బైక్ ర్యాలీ



పట్టణంలో బైక్ ర్యాలీ చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగ సంఘాలు, పలు పార్టీల మాదిగ యువత, నాయకులు శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా మాదిగ జాతి అభ్యున్నతికి మందకృష్ణ మాదిగ సాధించిన విజయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీపై పట్టు సాధించాలి



విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో హిందీ మాధ్యమిక పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సివి రమణమూర్తి ఉత్తీర్ణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి హిందీ పట్ల మక్కువ చూపాలన్నారు. దీంతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై విచారణ



నేకనాపురంలో రేషన్ డోర్ డెలివరీపై విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సౌజన్య

సిద్దవటం : రేషన్ బియ్యం ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దకు వచ్చి పంపిణీ చేస్తున్నారా లేదా అని గ్రామ ప్రజలను విచారించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తహసీల్దారు సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పెద్దపల్లి, నేకనాపురం గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేస్తున్నారా లేదా అని గ్రామంలోని ప్రజల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. తాజాగా బియ్యంతోపాటు పంచదార, కందిబేడలు పంపిణీ విషయంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు నాని, రేణుక పాల్గొన్నారు.

బండ్లపెంట దర్గాలో ప్రార్థనలు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : బండ్లపెంటలోని హజరత్ మలింషా(చిక్కాడ్ సాహెబ్) దర్గాలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దర్గాలో జరిగిన నిషాన్ కార్యక్రమానికి దర్గా కమిటీ సభ్యుడు యూసుఫ్ ఆహ్వానం మేరకు రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్ కొలిమి హరూన్ బాషా, జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్‌చైర్మన్ తబ్రేజ్, ఎస్కే బాషా, నవాజ్, జబీబుల్లా, అజ్మత్‌ఖాన్‌లు పాల్గొన్నారు. వీరు సాహెబ్ మజార్ వద్ద పూలగలఫ్ ఎక్కించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నందలూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, మండల విద్యాశాఖాధికారి నాగయ్యలు విడుదల చేశారు. ఈనెల 8వ తేదీ జరగనున్న ఎన్నికల కోసం ఈ ప్రకటన విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితాను విడుదల చేసి, ఐదవ తేదీన అభ్యంతరాలను స్వీకరించనున్నామని, ఈ మేరకు ఓటర్లందరికీ ఆహ్వానాలు పంపనున్నామని ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి పేర్కొన్నారు.

గోశాల షెడ్ నిర్మాణానికి సహకారం



గోశాలను సందర్శిస్తున్న గజల్ శ్రీనివాస్

సిద్దవటం : మండల పరిధిలోని మోదీన్‌సాబ్‌పల్లె గ్రామ సమీపంలో అవుల మారెమ్మ గుట్టపైన రేవూరి వెంకటనరసింహ స్వామి ఏర్పాటు చేసిన గోశాలను శుక్రవారం హిందూ సేవ్ టెంపుల్ భారత్ చైర్మన్ సేవ్ గజల్ శ్రీనివాస్ సందర్శించారు. గోశాలకు నూతన షెడ్‌ను నిర్మాణానికి సహకరిస్తామని తెలియజేశారు.

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం



ఏవీ రమణమ్మ తహసీల్దార్

ఒంటిమిట్ట : మండలంలో భూ ఆక్రమణలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఏవీ రమణమ్మ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం నుంచి ఒంటిమిట్టకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు, ఉద్యోగులు సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందిని యథావిధిగా కొనసాగించండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్): ఏపీ బాలికల గురుకుల విద్యాసంస్థల్లో పురుష నాన్ టీచింగ్ సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సాంఘిక సంక్షేమ గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కోరింది. మంగళవారం మంత్రిని కలుసుకున్న వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ గురుకులాల్లో 850 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ గురుకులాల్లో, డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని నిర్ణయించిందని దీని వల్ల సుమారు 400 మంది సిబ్బంది తమ ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందన్నారు. ఇప్పటికే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 2 నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి తెలియజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ వెనక్కి తీసుకునేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో వెంకట్, రామమూర్తినాయక్, పద్మనాభం, వెంకటచలపతి, శ్రీనివాసులు, ఆంజనేయులు, పురుషోత్తం, మదన్, సుబ్రమణ్యం, శీను, ఆనంద్‌నాయక్, రమణ తదితరులు కోరారు.

హామీలు మాయమవుతాయి



ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే

రాయచోటి : చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మాయమవుతాయని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఇంకో మాట మాట్లాడటం ఆయనకు అలవాటేనని చురకలంటించారు. మరికొద్ది రోజుల్లో సూపర్ సిక్స్ హామీల పత్రాలు మాయం కావడం తథ్యమన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వాగ్దానాలకు తూట్లు పొడుస్తూ దోపిడీకి తెరతీస్తున్నారని తెలియజేశారు. వాగ్దానాలను అమలు చేసే చిత్తశుద్ధి చంద్రబాబుకు ఎక్కడ ఉందని రమేష్‌రెడ్డి ప్రశ్నించారు.

పునరావాస కాలనీ పనులు వేగవంతం చేయండి



సబ్ కలెక్టర్‌కు ఆర్‌ఆర్-5 పనులను వివరిస్తున్న సీపీఓ సుదర్శన్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె, అరుంధతివాడ, హరిజనవాడ గ్రామస్తులకు నిర్మిస్తున్న పునరావాస కాలనీ పనులను వేగవంతం చేయాలని అధికారులను సబ్ కలెక్టర్ వెఖోమ్ నిధియా దేవి ఆదేశించారు. శుక్రవారం మంగంపేట ఆర్‌ఆర్ – 5 పునరావాస కాలనీ పనులను ఆమె పరిశీలించారు. దాదాపు 100 కోట్ల నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తదుపరి గ్రామస్తులు తమకు తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేస్తే ఇంటి నిర్మాణాలను చేపడతామని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. మూడు గ్రామాలకు మూడు అంగన్‌వాడీ సెంటర్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేశారని వాటిని కూడా నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఇందుకు సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం సీపీఓ సుదర్శన్ రెడ్డి మ్యాప్ ద్వారా పునరావాస కాలనీ పనులను సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్పంచ్ మినుగు సుధాకర్ గ్రామస్తుల సౌకర్యార్థం శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఈఈ మురళీకృష్ణ, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, సీపీఓ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పీర్‌మున్నీ, ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్ధతులతో అధిక దిగుబడులు



సంబేపల్లె: పొలంబడి నిర్వహించిన అధికారులు

రామాపురం : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని లక్కిరెడిపల్లె డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లె గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మాట్లాడుతూ రైతులకు పొలం బడి ఆవశ్యకతను తెలియస్తూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకంతో పెట్టుబడిని తగ్గించి ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేసుకోవడంతో నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునని, వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసలలో జొన్న పంటను రక్షక పంటగా వేసుకోవడంతో తామర పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఆముదం పంటను ఎర పంటగా వేసుకోవడంతో పొగాకు లద్దె పురుగులను నివారించుకోవచ్చునని తెలియజేశారు. వేరుశనగ పొలంలో రసం పీల్చు పురుగుల నివారణకు వేప నూనెను పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. సమావేశంలో వ్యవసాయాధికారి నాగమణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో దిగుబడి

సంబేపల్లె : మండలంలోని నాగిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం ఏడీఏ శ్రీలత ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్యాప్ పొలంబడి ద్వార రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చో తెలియజేశారు. వేరుశనగలో మిత్రపురుగుల సంరక్షణకు , పంటకు హాని చేయు పురుగులు చనిపోవుటకు నీమాస్త్రం ఎకరాకు 200 లీటర్లను ప్రతి 15 రోజులకు ఒకసారి ఇలా 5 సార్లు పిచికారీ చేస్తే పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

పిల్లలను బడులకు పంపండి

చిట్వేలి : బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, వారిని కూలీ పనులకు పంపించరాదని మండల విద్యాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాజుకుంట ఎస్టీ కాలనీలో ఎంఈఓలతో పాటు సీఆర్‌పీ చంద్రలు పర్యటించి మధ్యలో బడి మానేసిన నలుగురు విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వీరిని చిట్వేలి ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతిలో ఇద్దరిని, ఆరో తరగతిలో మరో ఇద్దరిని చేర్పించారు. వీరికి బ్యాగు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. అలాగే మండలంలోని బాలుర వసతి గృహాలను తనిఖీ చేసి అందుతున్న సౌకర్యాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల టీచర్లకు ప్రాధాన్యతివ్వండి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

రాజంపేట టౌన్ : పని సర్దుబాటులో ఏకోపాధ్యాయ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీఆర్‌టీయూ రాజంపేట శాఖ అధ్యక్షులు ఎస్.జమాల్‌బాషా, ప్రధాన కార్యదర్శి రెడ్డిచెర్ల హరిప్రసాద్ ఎంఈఓ – 1 రఘునాథరాజు, ఎంఈఓ – 2 సుబ్బరాయుడులను కోరారు. ఈమేరకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం వారు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో ఏకోపాధ్యాయ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అలాంటి పాఠశాలల్లో పనిచేసేవారు సెలవు పెట్టుకోవాలన్నా ఇబ్బంది పడుతున్నారన్నారు. అందువల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. అలాగే పలు ప్రాథమిక పాఠశాలల్లో ఆరు, ఏడు తరగతుల విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా పనిసర్దుబాటు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా హెచ్‌ఎంతోపాటు స్కూల్ అసిస్టెంట్‌లను, పీడీ లేక పీఈటీలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సోమశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనధికార కోతలు.. అల్లాడుతున్న ప్రజలు

నందలూరు : మండలంలో విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. కోతలకు సంబంధించిన కారణాలు ఏమైె ఉన్నా వినియోగదారులకు సమాచారం లేకుండా అధికారులు కోతలు విధిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల నాగిరెడ్డిపల్లె ఆర్‌ఎస్ రోడ్డులో ఓ ప్రైవేట్ స్థలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చేందుకు ఏడు గంటలపాటు కరెంట్ కోత విధించారు. ప్రైవేట్ స్థలం యజమాని వినతి మేరకు యుద్ధప్రాతిపదికన పనులు చేయించడంలో అధికారులకు ముడుపులు అందాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. అలానే ఒంటిమిట్ట నుంచి మండలానికి సరఫరా అయ్యే విద్యుత్‌లో అంతరాయం ఏర్పడడం వల్ల తాళ్లపాక నుంచి విద్యుత్‌ను అందించేందుకు ఓ రోజు రెండు గంటలకుపైగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మరొకరోజు బహుదానది సమీపంలోని రహదారి వద్ద విద్యుత్ తీగలు తెగిపడ్డాయంటూ ఒక రోజు, నాగిరెడ్డిపల్లిలో లైన్లు తెగిపడ్డాయంటూ మరో రోజు విద్యుత్ కోత విధించారు. శుక్రవారం కన్యకా చెరువు సమీపంలో, నందలూరు వద్ద రెండు కొత్త ట్రాన్సుఫార్మర్ల ఏర్పాటు కోసం దాదాపు మూడు గంటలకు పైగా విద్యుత్ కోత విధించారు. ఇది కాక రోజుకి గంటో, రెండు గంటలో విద్యుత్ కోత విధిస్తూ విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు గురి చేస్తున్నారు. అనధికార విద్యుత్ అంతరాయాలతో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని మండలవాసులు తెలియజేశారు. మండలంలో విద్యుత్ లైన్లు నాసిరకంగా ఏర్పాటు చేయడంతోనే విద్యుత్ కోతలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు అనధికార విద్యుత్ కోతలు చేపట్టకుండా చర్యలు చేపట్టి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని నందలూరు మండల వాసులు కోరుకుంటున్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు



మత్తు పదార్థాల చేసే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : ఎవరూ మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేట ప్రధాన బస్టాప్ వద్ద శుక్రవారం సీఐ, స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, జాగ్రతగా ఉండాలన్నారు. మీ ఇంట్లో విలువైన వస్తువులు ఉంచి తాళాలు వేసుకొని మీరు ఇతర ప్రాంతాలకు, స్వగ్రామాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పెద్ద ఓబన్న , హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీపీఓ ధనలక్ష్మి, అధికారులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా డీపీఓ ధనలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, రీసోర్స్ పర్సన్ పి.రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.

ముర్రుపాల ప్రయోజనాన్ని తల్లులు తెలుసుకోవాలి



సిద్దవటం: పోస్టర్ ద్వారా మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



రామాపురం: మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీలు



పుల్లంపేట: తల్లిపాలు విశిష్టతను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మీ



రైల్వేకోడూరు: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యశోధ



సంబేపల్లె: తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న అంగన్‌వాడీ అధికారులు

సిద్దవటం : తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్త బి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. మండలంలోని మాధవరం-1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు తల్లి పాల అవశ్యకతను తెలియజేశామన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాపించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉండటంతో తల్లి, బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్‌లు సుజాత, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : పుట్టి బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని గున్నికుంట్ల క్లస్టర్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గున్నికుంట్ల, దండువారిపల్లె, కత్తివాండ్లపల్లె, జి.హరిజనవాడ సంబంధించి చౌటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ప్రతి తల్లి పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దొరస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమ్మ, గున్నికుంట్ల సెక్టార్‌లోని అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : తల్లి పాల వల్ల బిడ్డలు, తల్లులకు ఎంత ప్రయోజనమో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తెలుసుకొని పిల్లలకు అందించాలని శుక్రవారం సూపర్‌వైజర్ యశోధ తెలిపారు. మండలంలోని చియ్యవరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు తల్లి పాలు పట్టించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : తల్లిపాలు శిశువుకు అమృత తుల్యంతో సమానమని అంగన్‌వాడీ టీచర్ రేష్మ భాను పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా పెట్రోల్ బంకు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ నవజాతి శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠమని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించడం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దాద్ బీ, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ యర్రంరెడ్డిగారిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని చేపట్టారు. తల్లిపాల విశిష్టతను, బిడ్డపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తులసమ్మ, పద్మజరాణి, హుస్సేనమ్మ, సుజాత రెడ్డి, గువ్వలచెరువు సెక్టర్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పుల్లంపేట : తల్లపాలు ఆరోగ్యానికి సంజీవిని లాంటిందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ జయలక్ష్మీ పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేస్తాయని విజయలక్ష్మి తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం అనంతంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వనజ కుమారి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాన్పు అయిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, మొదటి ఆరు నెలలు తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల న్యూమోనియా, అతిసార, బీపీ, షుగర్, స్థూలకాయం వంటి జబ్బులు బిడ్డకు రాకుండా సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయని తెలిపారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటివి రాకుండా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సూపర్‌వైజర్ ఎల్లమ్మ, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు సుశీల, మహిళా పోలీస్, హెల్త్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.